ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

గురువారం 28 నవంబరు 2024 www.prajaaswaramdaily.com


# వివాదంలో సీరియల్ నటి ప్రియాంక జైన్



### తిరుమల నడక మార్గంలో పులి కనిపించిందని ప్రాంక్ వీడియో

### వారిద్దరిపై చర్యలకు టీటీడీ సిద్ధం

తిరుపతి : బిగ్ బాస్ ఫేం ప్రియాంక జైన్, ఆమె బాయ్ ఫ్రెండ్ శివకుమార్ వివాదంలో చిక్కుకున్నారు. తిరుమలకు వెళ్తూ.. అలిపిరి నడక మార్గంలో ఏడో మైలు వద్ద చిరుతపులి కనిపించిందని ఇద్దరు ప్రాంక్ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఈ వీడియో కొన్ని రోజుల క్రితం చిత్రీకరించారు. నడక మార్గంలో చిరుత పులి దాడి అంటూ.దీన్ని సామాజిక మాధ్యమాల్లో అప్ లోడ్ చేశారు. ఈ వీడియో దుమారం రేపింది. భక్తులను.... భయాందోళలకు గురిచేసే చర్యలకు పాల్పడటంపై విమర్శలు వెల్లువెత్తాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఈ వీడియో ఆధారంగా..వారిద్దరిపై చర్యలు తీసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది.

# సంగారెడ్డిలో బాలిక కిడ్నాప్ కలకలం



సంగారెడ్డి : సంగారెడ్డిలో మధ్యాహ్నం రెండున్నరేళ్ల బాలికను అపహరించిన గుర్తుతెలియని వ్యక్తి రాత్రి వదిలేసి వెళ్లడం తీవ్ర కలకలం రేపింది. బస్వాపూర్ కు చెందిన ఆకుల జగదీశ్, ప్రియ దంపతులకు రెండున్నరేళ్ల వయసున్న ధరణి అనే కుమార్తె ఉంది. జగదీశ్ ఏడాది క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అంధురాలైన ప్రియ అప్పటి నుంచి కుమార్తెతో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో కాలిబాటపై నివసిస్తోంది. సమీపంలోని హోటళ్ల వద్ద భిక్షాటన చేస్తూ కూతుర్ని పోషిస్తోంది. ధరణి మధ్యాహ్నం ఆస్పత్రి ఆవరణలో పిల్లలతో కలిసి ఆడుకుంటూ అదృశ్యమైంది. కుమార్తెను ఎంత పిలిచినా స్పందించక పోవడంతో తల్లి ప్రియ గట్టిగా కేకలు వేసింది. స్థానికులు స్పందించి ఆమెను ఆరా తీయగా కళ్లు కన్పించవని తెలిపింది. చుట్టుపక్కల ధరణి కోసం వెతకగా ఎక్కడా కన్పించలేదు. బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పట్టణ వ్యాప్తంగా సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతంలో చిన్నారిని సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ లో పోలీసులు గుర్తించారు.

## నయీమ్ ఆస్తుల కేసులో

# బీఆర్ఎస్ ది డైలీ సీరియల్



ధరణిని అడ్డుపెట్టుకొని వేలాది ఎకరాల కాజేశారు

### ఫోన్ ట్యాపింగ్ పై అన్ని విషయాలు బయటికొస్తాయి

### డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ పై డిప్యూటీ సీఎం భట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో అన్ని విషయాలు బయటికొస్తాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలా తాము టైమ్ పాస్ చేయబోము అన్నారు. వాస్తవాలను జనాల ముందు పెడతామన్నారు. నయీమ్ ఆస్తుల కేసు, మియాపూర్ ఆస్తుల విషయంలో బీఆర్ఎస్ టైమ్ పాస్ డైలీ సీరియల్ నడిపిందన్నారు.

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాల భూమిని కాజేశారు. కాజేసిన భూముల వివరాలు బయటకు తీస్తాం. రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. మంత్రివర్గ విస్తరణపై పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. పసలేని విమర్శలతో ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. అభివృద్ధి చూసి ఓర్వలేక కొందరు కాకుల్లా అరుస్తున్నారు. హైడ్రా, మూసీ విషయంలో ఆలోచన చేశాకే ముందుకు పోతున్నాం. మూసీ విషయంలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు

పెద్దపల్లి : రామగిరి మండలం సుందిళ్లలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అర్చకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి ప్రదక్షిణలు చేసి ప్రత్యేక అర్చనలతో పూజలు జరిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో రైతులు.. పాడి పంటలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానికులంతా కలిసి మంత్రికి పలు సమస్యలంపై వినతి పత్రాలను అందించారు.



# అదానీని అరెస్టు చేయాలి

### విచారణ జరిపితే వాస్తవాలు
### అవినీతి ఆరోపణలను ఖండించడంలో ఆశ్చర్యమేమీ లేదు
### లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : లంచం, అవినీతి ఆరోపణలను అదానీ గ్రీన్‌ఎనర్జీ ఖండించడం ఎలాంటి ఆశ్చర్యం కలిగించలేదని లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. అవినీతి ఆరోపణలను అదానీ అంగీకరిస్తారని ఎలా అనుకుంటారని ప్రశ్నించారు. అదానీని అరెస్టు చేసి విచారణ జరిపితేనే వాస్తవాలు బయటకు వస్తాయని...... రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. ఆయనను అరెస్టు చేయకుండా కేంద్రమే రక్షిస్తోందని ఆరోపించారు. చిన్న చిన్న ఆరోపణలపై ఎంతో మందిని అరెస్టు చేస్తున్నారన్న రాహుల్ అదానీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అంతకుముందు ఇండియా కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన లోక్ సభాపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే ఛాంబర్ లో సమావేశమయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించామని కాంగ్రెస్ పార్టీ తెలిపింది.

# ఫ్యాక్టరీ పనులకు బ్రేక్



పనులు నిలిపివేయాలని ఆదేశం

నిర్మల్ : ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాల్సిందిగా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమ వద్దంటూ కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న గ్రామస్తులతో ఆమె చర్చించారు. మంగళవారం నాటి ఘటనపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులకు తెలిపారు. పరిశ్రమ పనులు నిలిపివేయాల్సిందిగా తాజాగా ఆమె ఆదేశాలు జారీ చేశారు.

# దిలావర్‌పూర్‌లో ఉద్రిక్తత

### ఇథనాల్ పరిశ్రమ వద్దని నిరసన
### నిర్మల్ -భైంసా రహదారిపై బైఠాయింపు

నిర్మల్ : నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు నిరసనగా స్థానికులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ నుంచి నిర్మల్ - భైంసా రహదారి వైపు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానికుల నిరసనతో పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళనలో భారీగా పాల్గొన్న మహిళలు... ఇథనాలు పరిశ్రమను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# రాయదుర్గంలో విషాదం

### 9వ అంతస్తు నుంచి పడి మహిళ మృతి

హైదరాబాద్ : రాయదుర్గంలో విషాదం చోటుచేసుకుంది. ఓ వివాహిత సరోగసీ కోసం వచ్చి ఓ అపార్ట్ మెంట్ 9 వ అంతస్తు నుంచి పడి ప్రాణాలు కోల్పోయింది. రాయదుర్గంలోని మై హోమ్ భూజా అపార్ట్ మెంట్ లో నివాసం ఉంటున్న రాజేష్ బాబు అనే వ్యక్తి.. ఒడిశా నుంచి వచ్చిన ఓ మహిళతో సరోగసి ద్వారా బిడ్డను కనిఇవ్వాలని 10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అపార్ట్ మెంట్ లోనే నెల రోజులుగా బయటికి వెళ్లనివ్వకుండా, తన భర్తతో మాట్లాడనివ్వకుండా నిర్బంధం చేశాడు. ఈ క్రమంలో సోమవారం అతడి బారి నుంచి తప్పించుకునేందుకు యత్నించింది. చీర సహాయంతో తొమ్మిదో అంతస్తు నుంచి ఆరో అంతస్తులోకి దిగే యత్నంలో పట్టుతప్పి కిందపడి మృతి చెందింది. తన భార్యతో లైంగిక వేధింపులకు పాల్పడడంతో అతని నుంచి తప్పించుకోవడానికి దూకినట్లు వివాహిత భర్త రాయదుర్గం పీఎస్ లో ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# జపాన్‌లో భూకంపం

### 6.1 తీవ్రతతో ప్రకంపనలు
### అణువిద్యుత్ కేంద్రం సురక్షితమన్న అధికారులు

టోక్యో : జపాన్ ను భూకంపం వణికించింది. నోటో ద్వీపకల్పంలో 6.1 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించాయి. అయితే అక్కడ ఉన్న అణువిద్యుత్ కేంద్రం సురక్షితంగానే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. షికా అణువిద్యుత్ కేంద్రంలోని రెండు రియాక్టర్ లకు స్వల్ప నష్టం జరిగినట్లు తెలుస్తుంది. అయితే రేడియేషన్ లీకేజీ జరగలేదని అధికారులు చెప్పారు. నోటో ద్వీపకల్పంలోని పశ్చిమ తీరంలో దాదాపు 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు జపాన్ భూకంప కేంద్రం వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 1న నోటో ప్రాంతంలో రిక్టర్ స్కేల్ పై 7.6 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా 370 మందికి పైగా మరణించారు. రోడ్లు, విద్యుత్ , మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జపాన్ లో ఏటా సగటున 5వేల చిన్నా పెద్దా భూకంపాలు వస్తుంటాయి.

# ధనుష్ వర్సెస్ నయనతార

### మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన నటుడు
### విచారణకు అంగీకారం

బెంగళూరు : లేడీ సూపర్ స్టార్ నయనతార, తమిళ స్టార్ ధనుష్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న నయన్ డాక్యుమెంటరీలో తన అనుమతి లేకుండా 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారంటూ రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ ఇప్పటికే డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ధనుష్ కోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా నేను రౌడీనే సినిమా విజువల్స్‌ను వాడుకున్నారని ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ మద్రాస్ హైకోర్టులో దావా వేసింది. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై కూడా దావా వేసింది. ధనుష్ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. విచారణకు అంగీకరించింది.



## రాహుల్ గాంధీకి

# ఎడమ కన్ను కేసీఆర్, కుడి కన్ను రేవంత్

### బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



హైదరాబాద్: రాహుల్ గాంధీకి ఎడమ కన్ను కేసీఆర్, కుడి కన్ను రేవంత్ రెడ్డి. .. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. రెండు పార్టీల నాటకాలను బట్టబయలు చేస్తాం. అక్రమ నిర్మాణం పేరుతో అయ్యప్ప సొసైటీ కట్టడాలను కేసీఆర్ ప్రభుత్వం వేగంగా కూల్చేసింది. ఆ తర్వాత అన్నీ సక్రమం అయిపోయాయి. రేవంత్‌రెడ్డి కూడా హైడ్రా పేరుతో అక్రమ నిర్మాణాలను కూల్చుతామంటున్నారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన వంద కోట్లను తిరస్కరించిన సీఎం.. కాళేశ్వరం కొట్టుకుపోవడానికి కారణమైన గుత్తేదారు విరాళాలు ఎందుకు తిరిగి ఇవ్వలేదు?. 6 మోసాలు.. 66 అబద్ధాలతో టైంపాస్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. ఇందిరమ్మ రాజ్యం అంటే దోచుకోవడం, దాచుకోవడమా?. కాంగ్రెస్ పాలనలో అత్యాచారాలు, హత్యలు పెరిగాయి. ఏడాది పరిపాలనపై కాంగ్రెస్ పార్టీ బహిరంగ చర్చకు సిద్ధమా?" అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను జైలుకు పంపుతామన్నారని.. ఏమైందని ప్రశ్నించారు. అప్పులు తేవడంలో గులాబీ పార్టీ పంథాలోనే కాంగ్రెస్ సర్కారు పయనిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ మూసీ ప్రణాళికనే.. ప్రస్తుత సర్కార్ అమలు చేస్తోందని చెప్పారు.